

# అమ్మకడుపు చల్లగా...

## – గొల్లపూడి మారుతీరావు



### (గత సంచిక తరువాయి)

**ఇప్పటికీ** మన మిలటరీ బాండు "సారే జహాసె అచ్చా. హిందూస్థాన్ హమారా" అంటూంటే వొళ్ళు పులకరిస్తుంది. ఆ గీత రచయిత ఇక్బాల్.

ఇదంతా 60 సంవత్సరాల కిందటిమాట. అప్పుడే ఈ దేశానికిస్వాతంత్ర్యం వచ్చింది. కేవలం మరో 30 సంవత్సరాలు వెనక్కి వెళితే 1919లో బొంబాయి మసీదులో ప్రసంగించడానికి గాంధీని ముస్లిములు ఆహ్వానించారు. ఢిల్లీ జమా మసీదులో ఆర్యసమాజ్ నాయకులు స్వామి శ్రద్ధానంద ఉపన్యాసం ఇచ్చారు.

ఇదివరకు కనిపించని బురఖాలూ ముస్లిం టోపీలు, పిల్లి గెడ్డాలూ – ఇప్పుడు విరివిగా కనిపిస్తున్నాయి. కారణం ఈ 60 సంవత్సరాలలో వారి మతం పట్ల వారికి అభిమానం పెరగడంకాదు. తమ 'ఉనికిని' చాటుకునే చాటుకోవాల్సిన రాజకీయ లబ్ది మతాన్ని వీధిన పారేసిందంటాను.

ఓ చిన్నకథ. మా అమ్మ తన చిన్నతనంలో స్కూలుకి వెళ్ళి రోజూ ఓ కాణీతో ఇంటికి వచ్చేదట. మా అమ్మమ్మకి అనుమానం వచ్చింది. ఎవరో ఇస్తున్నారని చెప్పిందట మా అమ్మ. అనుమానం తీరక ఓరోజు మా అమ్మమ్మ కూతురుతో బడికి వచ్చింది. ఓ ముసలివాడు – ముస్లిం – ఆమె కోసం ఎదురు చూస్తున్నాడట.

"ఎందుకు మా అమ్మాయికి డబ్బులు ఇస్తున్నావు తాతా?" అనడిగిందట మా అమ్మమ్మ.

కళ్ళనిండా నీళ్ళు తిరగ్గా "ఇంత వయస్సులో నా బిడ్డ పోయిందమ్మా. ఈ పాపని చూస్తే నా బిడ్డ జ్ఞాపకం వస్తుంది" అన్నాడట వృద్ధుడు.

మా అమ్మ ఈ కథ చెప్పేది. టాగూర్ 'కాబూలీవాలా'నంతా ఈ చిన్న సన్నివేశంలో కుదించి చూడవచ్చు.

ఆ వృద్ధుడిది ఏ మతం? 'మానవ మతం.'

ఓ రోజు దాదాపు 42 సంవత్సరాల తర్వాత విశాఖపట్నం గురజాడ అప్పారావు కళామండపంలో ఉపన్యాసం ఇస్తున్నాను. ఉన్నట్టుండి సభాసదుల్లో మొదటి వరుసలో ఒకాయన నన్నాకర్షించారు. ఆయన 45 సంవత్సరాల క్రిందట మా ఇంగ్లీషు టీచరు. ఇంకా మా క్లాసు టీచరు. థామ్స్ గాబ్రియేలు మాష్టారుగారు. ఆనాటి నా ప్రసంగమంతా ఆయన మీదకి పోయింది. నా ప్రసంగాన్ని గురించి పేపర్లో చూసి వచ్చారట. ఆయనకి పాదాభివందనం చేస్తే కంగారు పడిపోయారు.

ఆయనకి నమస్కారం చెయ్యడానికి నాకు 'మనీషా పంచకం' అక్కరలేదు. ఆయన నాకు చదువు చెప్పిన గురువు.

స్కూలు వార్షికోత్సవంలో మొదటిసారి వేదికనెక్కి ఇంగ్లీషు పద్యం చదివాను. అది నా జీవితంలో ప్రేక్షకులకు సంబంధించి మొదటి ప్రదర్శన. వేదిక మీదకి వచ్చి వందలాది తలల్ని చూస్తూనే 16లైన్ల పద్యంలో దాదాపు పదిలైన్లు మరచిపోయాను. అంతకుమించి వణికిపోయాను. ఆ తర్వాత దాదాపు 50 సంవత్సరాలు వేలాది సభలలో ఉపన్యాసాలిచ్చే కెరీర్‌కి అది ప్రారంభం. ప్రతీ సభలో ప్రతీ ఉపన్యాసమూ ఓ పరీక్షే. కాకపోతే అనుభవం ఆ భయాన్ని ఓ అలవాటుగా మారుస్తుంది.

విప్పర్తివారి వీధిలో భైరి కొండలరావని ఓ మిత్రుడుండేవాడు. నిజానికి అతని తమ్ముడు నాక్లాస్‌మేట్. రచనల్ని కాలమ్స్ గా కత్తిరించి కాస్త పొడవాటి కాగితాల మీద అంటించి పుస్తకాలుగా చేసుకుని ఉంచుకునేవాడు.

పురాణ శ్రవణం ద్వారా నాలో ప్రచ్ఛన్నంగా వున్న దాహం అది చూశాక మేలుకుంది. నా రచనలు పుంఖానుపుంఖాలుగా చేసి అలా పుస్తకాలుగా చెయ్యాలని కోరిక బయలుదేరింది. నాదైన రచనని ప్రచురించాలన్న ఆ రచనకి అదే నాంది. కొండలరావు రచనలు 'రేనాడు' అనే ప్రొద్దుటూరు పత్రికలో ప్రచురితమయేవి. రేనాడు కేవలం ప్రొద్దుటూరుకీ, ఆ పరిసరాలకీ పరిమితమయిన స్థానిక పత్రిక. కె. బాలనారాయణ రెడ్డి అనే ఎమ్మెల్యేగారు ఆ పత్రిక నడిపేవారు. అందులో కోర్టు, వ్యాజ్యాల నోటీసులూ, స్థానిక ప్రకటనలూ ఎక్కువగా ఉండేవి. స్థలాన్ని బట్టి స్థానిక వార్తలూ, ఇంకా స్థలం మిగిలితే కొండలరావు వంటి వారి రచనలు కొన్ని చోటు చేసుకునేవి. అవేం గొప్ప రచనలు కావు. గొప్పవయితే రేనాడు దగ్గర ఆగవు. నా పరిస్థితీ అదే. నా మొట్టమొదటి రచన ఏదో ఇంగ్లీషు కథ చదివి నాకు తోచిన భాషలో రాసింది. పేరు 'ఆశాజీవి.' 1954 డిసెంబరు 18న రేనాడులో ప్రచురితమైంది. అదే ఓ రచయిత పుట్టినరోజు. ఆ పత్రిక పట్టుకుని ప్రింటులో నా పేరు చూసుకుని మత్తెక్కినట్టు ఊరంతా తిరిగాను. ఆ కథని ప్రొద్దుటూరులో ఎంతమంది చదివారో తెలీదు. మిగతా చోట్ల ఎవరికీ ఆ కథ గురించి తెలిసే అవకాశం లేదు. ఆ రచన పడిన పత్రిక 50 ఏళ్ళ తర్వాత ఇప్పటికీ నా దగ్గర ఉంది. నేను రాసిన కథేకాదు, నేనూ ఆశాజీవినే.

ఓ ప్రభంజనానికి అది కేవలం ప్రారంభం. 15ఏళ్ళ కుర్రాడి మనస్సులో ఏం ఆలోచనలుంటాయి? ఎన్ని ఉంటాయి? అలోచనలకన్నా ఆవేశం జలపాతంలాగ ఉవ్వెత్తున లేచే కుర్రాడి ఆర్తికి ఆటవిడుపు ఎక్కడ? నా ఉధృతికి తగిన సరుకు ఆనాడు నా మెదడులో లేదు. మరి ఏది గతి? అందుకని వరసగా అనువాదాల మీద పడ్డాను. లియో టాల్‌స్టాయ్ 'ది ప్రిజనర్ ఆఫ్ కాకేసస్' నవలని అనువదించాను. రవీంద్రుని కథలు అనువదించాను. ఇవికాక మరెన్నో కథానికలూ, గేయాలూ, రాత్రీ, పగలూ ఇదే పని. ఏ రోజూ రచన చేయనిదే నిద్రరాదు. ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, భారతి ఆ రోజుల్లో ప్రముఖమైన పత్రికలు. కథల్ని సాపు రాసి పత్రికలకి పంపేవాడిని. దాదాపు అన్నీ తిరిగి వచ్చేవి. వచ్చిన వాటిని చూసుకుని కృంగిపోయేవాడిని. అయితే రేనాడు ఉండనే ఉంది. హిందూ రీడింగ్ రూముకి ఎదురుగా చర్చి పక్కన విన్నకోట దుర్గారావు ప్రెస్స్ ఉండేది. ఆయనా రేనాడులా 'విశాఖ పత్రిక' అనే స్థానిక పత్రిక ప్రచురించేవారు. దాదాపు నమూనా అదే, లక్ష్యమూ అదే. స్వయంగా వెళ్ళి దుర్గారావుగారికి నా రచనలు ఇచ్చేవాడిని. స్థానిక పత్రికలో కాలమ్స్ నింపడానికి నా స్థాయి. నా రచనలు చాలు. కాని కొత్త రచయిత తొలినాళ్ళ కృషికి అది గొప్ప ఊతం. పత్రిక ప్రెస్సులోంచి వచ్చేదాకా రీడింగ్ రూముకి ఎదురుగ్గా చర్చిముందు రోడ్డు పక్క నిలాబ్డేవాడిని. వేడి వేడి పేపరులో అచ్చులో నా పేరు చూసుకోవడం ఓ తన్మయత్వం. ఆనందంతో పిచ్చివాడిలాగా తిరిగేవాడిని.

విశాఖలో రంగా బైండింగ్ వర్క్స్ పక్కన సిటీ న్యూస్ ఏజెన్సీ అని చిన్న షాపు ఉండేది. అదొక్కటే ఆ రోజుల్లో పత్రికలు అమ్మే దుకాణం. నాలాంటి కుర్రాళ్ళు పత్రిక కొనకుండా పేజీలు తిప్పుతారని పత్రికలకి పిన్ను వేసేసేవారు. దాని ప్రొప్రయిటర్ అప్పలరాజు రెడ్డి. నన్ను పుస్తకం ముట్టుకోనిచ్చేవాడు కాదు కొననిదే. పత్రికలో నా రచన వచ్చిందో లేదో చూసుకోవాలని ఆరాటం. అన్నీ కొనే స్థోమతా లేదు, అవసరమూ లేదు. ఎప్పుడయినా మూడ్ సరిగా ఉంటే చూసుకోమనేవాడు. ఆ రోజు పండగ. పేపర్లో కథ రాకపోతే మళ్ళీ బాధ. అప్పలరాజురెడ్డి సీరియస్‌గా ఉండేవాడు. ప్రధమ కోపం. అతని ప్రాపకం కోసం తపన పడిపోయేవాడిని. మొన్న అంటే – 48 సంవత్సరాల తర్వాత అతని కొడుకు తండ్రిని వెంటబెట్టుకుని నన్ను చూడడానికి వచ్చాడు. రాజురెడ్డికి ఇప్పుడు దాదాపు 80 ఏళ్ళు. చెముడు వచ్చింది. ఆ రోజుల్లో మిమ్మల్ని చూసి భయపడేవాడిని అంటే నవ్వేశాడు. వయస్సు మనిషిని లొంగదీసింది. ఇప్పుడు న్యూస్ ఏజెన్సీ లేదు. ఇప్పుడు చాలా దుకాణాలు వచ్చాయి. అన్నిటికీ మించి నాలాగా పడిగాపులు పడే రచయితలు లేరు. రాసిందంతా వేసే పత్రికలూ వచ్చాయి. రాసిందంతా బంగారమనే ఆత్మవంచనని పంచే వాతావరణమూ వచ్చింది. రచయిత అనుభవాన్ని సానపెట్టి పెద్దల మధ్య తన రచనని నిలబెట్టే ఆత్మవిశ్వాసం సంపాదించుకోవలసిన అవసరమూ పోయింది. అవసరమని చెప్పేవారూ లేరు. అది ఒక విధంగా రచయిత దురదృష్టం అయితే మరొక విధంగా సమాజానికి దురదృష్టం కూడాను.

సీనియర్ రచయితల ముందు తన ఆలోచనల్ని నిలబెట్టే పరిణతి కోసం రచయిత గుంజాటనపడాలి. భయపడాలి,

బాధ్యతతో పది పుస్తకాలు చదవాలి. రాసింది పదిసార్లు చదువుకోవాలి. వీలయితే నాలుగయిదుసార్లు రాయాలి. అప్పటికీ పెద్దల విమర్శకి నిలుస్తుందా లేదా అని మథనపడాలి. ఈ సాధనలోంచి రచయిత క్రమంగా ఆత్మవిశ్వాసాన్ని, నమ్మకాన్నీ, ధైర్యాన్నీ తనదయిన గొంతునీ ఏర్పరచుకుంటాడు. ఇది ఆగని పరిశ్రమ. కొన్ని రోజుల, సంవత్సరాల కృషి – కార్యరూపం దాల్చడం.

మా తరంలో 'భారతి' స్థాయికి ఎదగడం ఓ పట్టా పుచ్చుకోవడంలాంటిది.

రాసిన దానిలోనే వంద తప్పులుంటూ, దాన్ని వెయ్యి తప్పులు చెయ్యగల పత్రికలు అండగా నిలుస్తూ పనికిరాని వాదాలూ, వాదులూ ఆడుకునే దశకి రచనా వ్యాసంగం జారిపోయిందని నాకనిపిస్తోంది. ఈ మాటంటే ఇప్పటి రచయితలకి  కోపం వస్తుందేమో. అయినా నా అభిప్రాయం నాది.

ఒక్క నన్నయ్యని చదువుకుంటే చాలు ఆలోచన పదునుదేరుతుందన్నారు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు. "వీణ్ణి బాగుచెయ్యాలంటే వీడిచేత భారతం చదివించాల"న్నారు జలసూత్రం – తిరువణ్ణామలైలో  అప్పుడే రచన ప్రారంభించిన కూర్మారావుని ఉద్దేశించి.

"కవిత్వం అందరికీ తెలిసేటట్టుండాలి" అనడం ఆశక్త దుర్జనత్వం అన్నారు శ్రీపాద. నేనంతమాట అనను కాని నేటి రచయిత 'బాధ్యత' తెలియకుండా బరువు దించుతున్నాడంటాను.

అయితే నా రచనా వ్యాసంగం ఇంట్లో పెద్ద సమస్య అయిపోయింది. మా చిన్నాయనగారు (పిన్ని భర్త) ఉద్యోగరీత్యా విశాఖ వచ్చి మా ఇంట్లో ఉండేవారు. నేను లెక్కల్లో సున్న. అలాంటిది నన్ను కూర్చోబెట్టి లెక్కలమీద ఆసక్తినీ, శ్రద్ధనీ పెంచారు. ఆ తరువాత ఓ స్థాయికి వచ్చానంటే లెక్కలు కారణంగానే. ఎస్సెస్సెల్సీలో 60శాతం మార్కులూ, ఇంటర్మీడియెట్‌లో ఫస్ట్ క్లాసు వచ్చింది. అయితే ఇప్పుడీ రచనా వ్యాసంగం నాకు మరి దేనిమీదా దృష్టి పోనిచ్చేది కాదు. రాత్రి హరికేన్ లాంతరు ముందు కూర్చుని (ఆ రోజుల్లో మా ఇంట్లో ఎలక్ట్రిక్ దీపాలు లేవు) చదివే పాఠ్యపుస్తకం కింద నవలో, రాసే క్లాసు పుస్తకం కింద కథో వుంచుకు చదివేవాడిని. మా చిన్నాయన మెల్లగా వెనకనుంచి వచ్చి నన్ను పట్టేసేవాడు. అక్కడినుంచీ మా అమ్మ దీవెనలు మొదలుపెట్టేది. 'వీడింక బాగుపడడు' అన్నది నా గురించి ఇంట్లో తేల్చుకున్న విషయం. మా నాన్నగారు అంతగా పట్టించుకునేవారు కాదు.

పదిహేనో ఏట రచన మత్తులో పడ్డ కుర్రాడిని తీర్చిదిద్దే చదువుకానీ, వృత్తి విద్యకానీ ఈ దేశంలో లేదు ఆనాటికి. తీరా చదివాక ఉపాధి కల్పించే అవకాశమూ లేదు. జర్నలిజం వృత్తిగా చేసుకోగలిగే ఆలోచన కాని, అవకాశం కాని దాదాపు పదేళ్ళ తర్వాతి మాట. ఆనాడు ఊహించలేని విషయం.

పల్లెటూళ్ళో కులవిద్యలూ, వృత్తివిద్యలూ అంతా నిర్వర్తించుకుంటూండగా సంపన్నులు వార్షికాలివ్వడమో, జమిందార్లు అగ్రహారాలివ్వడమో ఒకనాటి కథ.

ఎవరింట్లో శుభకార్యంజరిగినా ఊరంతా ఏకమయి పండగ చేసుకోవడం, అందరూ కలసి భోజనం చెయ్యడం ఆనాటి సంపన్నత. ఇందుకు విశ్వనాథవారి 'ఆత్మకథ' సాక్ష్యం. ఇందులో కులవివక్షలు లేనేలేవు.

కాలం మారి పరాయి పరిపాలన వచ్చాక ఇంగ్లీషు వారు తమ అవసరాలు తీర్చడానికి మనకేం చదువుకావాలో, ఎంతవరకు కావాలో అదే నేర్పిపోయారు.

ఆ రోజుల్లో కొడుకు పల్లె వదిలి పట్నం వెళ్ళాననడం గొప్పలాగ యీ రోజుల్లో కొడుకు చదువుకుని అమెరికా వెళ్ళాననడంలాగ. ప్రతీవాడూ ఇంగ్లీషు చదువు చదవడం ఒక పురోగతికి నిదర్శనం.

ఉద్యోగం, ఆదాయం పరమయిపోయాయి. ఈనాటి చదువులు. "మావాడు ఎంటెక్ చదివాడు. పదివేల జీతం వస్తుంది" అనడం గొప్ప.

"మా వాడు బొమ్మలేస్తాడు – గొప్పగా."

"అయితే ఏమంటావు?"

"వేసి ఏం చేస్తాడు?"

అర్థంకాని దశ యిది.

అభిరుచితో ప్రమేయంలేని, గానుగెద్దు చదువులే యిప్పటికీ సాగుతున్నాయని నా మతం.

రేషన్ షాపులో పనిచెయ్యడానికీ, బ్యాంకులో పనిచెయ్యడానికీ బికాం ఎందుకు ఉపయోగపడుతుంది? పని కోసం చదువంటే రేషన్ షాపు పనికి వేరే చదువు అవసరంకదా? యివన్నీ నాకు తీరని ప్రశ్నలు.

పదే పదే 'నాకు  అని చెప్పుకోడానికి కారణం యిది "నిన్నటి బానిసత్వపు చదువులు" అని ప్రశ్నించుకోవడం కూడా మరిచిపోయిన మొద్దుబారిన జీవితాలయిపోయాయి కనుక.

ఆ రోజులలో నాకు రచనా వ్యాసంగాన్ని మప్పే చదువు నాకెవరయినా చూపగలిగితే? నా పెళ్ళిలో మా మామగారు నేను తెలుగు ఉపసంపాదకుడినని ఎవరికో పరిచయం చేస్తూ సిగ్గుపడిపోయారు. కనీసం. ఈ రోజు 'పత్రికా రచన 'కి దక్కే గౌరవం ఆ రోజుల్లో ఎవరు ఊహించగలరు?

ఓ సంధ్యాకాలంలో నా అభిరుచినీ, అంతకుమించి మనస్సులో రగిలే బడబానలానికి మద్దతు దక్కని రోజుల్లో బ్రతికానని చెప్పడం నా తాత్పర్యం.

అలాగే నా నాటకాల పిచ్చి. ఏళ్ళ తర్వాత ఆంధ్రా యూనివర్శిటీలో 'థియేటర్ ఆర్ట్స్' విభాగం ఏర్పడింది. దానికి 'తెలుగు నాటక రంగం' అనే నా వ్యాస సంపుటి పాఠ్యగ్రంథమయింది. చిరంజీవిలాంటి స్టూడెంట్స్ చెన్నై ఫిలిం ఇన్స్టిట్యూట్‌లో నా 'రాగరాగిణి' నాటకంలో డైలాగులు ప్రాక్టీసు చేశారు. నేను చాలా శిక్షణ సంస్థలలో ఉపన్యాసాలిచ్చాను. నా రచనలు వారికి పాఠ్యగ్రంథాలయాయి. నా 'కళ్ళు' నాటిక ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎమ్మే కోర్సుకి పాఠ్యపుస్తకమయింది. ఇవన్నీ అదృష్టవశాత్తో, విధివశాత్తో 'వీడెందుకూ పనికిరాడు' అనే పెద్దల నిర్వేదాన్ని తట్టుకుని పెరిగిన – ఓ కుర్రాడికి దగ్గిన గౌరవాలు. అయితే నాలాంటి అదృష్టవంతులు ఎంతోమంది ఉండకపోవచ్చు.

సంవత్సరాల తర్వాత ఓసారి హైదరాబాదు నుంచి మద్రాసు వెళ్తున్నాను. నా పక్కన డాక్టర్ సి.శివసుబ్బారావు అనే జాతీయ విద్యా ప్రణాళికా సంఘం (NCERT) డైరెక్టరు కూర్చున్నారు. మాటల్లో చదువు గురించి చెప్తూ అభిరుచిని ఎరిగి చెప్పే చదువులు ఆనాడూ లేవు, ఈనాడు లేవు. బికాం చదివిన కుర్రాడు రేషన్‌షాపులోనూ చేరతాడు, బ్యాంకు గుమాస్తా అవుతాడు. డిగ్రీ అనేది ఓ బండగుర్తు తప్ప చాలా సందర్భాల్లో ఆ చదువుకీ, చేసే వృత్తికీ పొంతనలేదు. నా 15 సంవత్సరాలప్పుడు ఎవరేనా నా అభిరుచినీ, ఉత్సాహాన్నీ గుర్తించి నాకు కావలసిన చదువు నేర్పించి ఉంటే ఓ విశ్వవిద్యాలయానికి బియస్సీ ఆనర్స్ డిగ్రీ వృధా చేసేవాడిని కాను అన్నాను. ఆయన ఇంప్రెస్ అయి 'మద్రాసు విద్యావేత్తల సమావేశంలో మాట్లాడతారా? నేను అవకాశం కల్పిస్తాను ' అని ఆహ్వానించారు.

'మీరు చెప్పండి, ఆలోచించండి చాలు ' అని ప్లేన్ దిగిపోయాను.

ఇప్పటికీ ఈ దేశంలో పరిస్థితి ఇదే. ధ్వన్యనుకరణ చేసేవానికీ, బుర్రకథ చెప్పేవానికీ, కుండలు చేసేవానికీ ప్రత్యేకమైన స్ఫూర్తినిచ్చే సాధికారికమైన పీఠమూ లేదు, ఆ కళకి official Sanction యిచ్చే విశ్వవిద్యాలయమూ లేదు. ఇప్పుడిప్పుడు నటన. సంగీతం వంటి ప్రక్రియలకి కాస్త ఊపిరి తిప్పుకునే అవకాశం దొరికింది. అదే పదివేలు.

ఏతా వాతా ఆనాటి పరిస్థితి అది. మా అమ్మ నిస్పృహనీ, మా చిన్నాయన విమర్శనీ తట్టుకోలేక ఎంత క్రుంగిపోయేవాడినో చెప్పలేను. కాగా రోజూ వచ్చిపడే పత్రికలూ తిరిగి వచ్చే బంగీలూ చూసి యింట్లో మరింత రాద్ధాంతం జరిగేది. మరి ఎలాగ? అప్పుడు ఎవరో చెప్పారు – ఉత్తరాలు 'కేరాఫ్ పోస్టుమాస్టర్' అనే అడ్రసుకి తెప్పించుకోవచ్చని. వెంటనే విశాఖపట్నం పాత పోస్టాఫీసుకి పరిగెత్తాను. అయితే ఈ సౌకర్యం కేవలం ఊరూరా తిరిగే ట్రావెలింగ్ సేల్స్ మాన్, వ్యాపారులకి మాత్రమే అనీ. అదీన్నీ కొద్దికాలానికి మాత్రమే పరిమితమని అక్కడ ఉద్యోగి చెప్పారు. నేను

ఏడిచినంత పనిచేసి నా కష్టం చెప్పుకున్నాను. ఏ మూడ్‌లో ఉన్నాడో ఆయన అంగీకరించాడు.

అంతే ఉత్తరాలు పోస్టాఫీసు గూళ్ళలో చేరేవేళకి దాదాపు ప్రతీరోజూ ఆ కిటికీ దగ్గర నిలబడేవాడిని. నా గూడులో ఉత్తరం చేరిందా లేక నా కథే చేరిందా? యిదీ ఆత్రుత. పోస్టాఫీసు ఉద్యోగులు నన్నో న్యూసెన్స్‌గా భావించేవరు. అయితే ఇంటి దగ్గర తిట్లకన్నా ఇది నయం. తిరిగొచ్చిన కవర్లు పట్టుకుని విక్టోరియా బొమ్మ పక్కనుంచి, ఇంపీరియల్ బ్యాంక్ పక్కనుంచి నడుస్తూ నా అదృష్టాన్ని తిప్పుకు చూసుకుంటూ యింటికి పోయేవాడిని. అయితే తలవంచని విక్రమార్కుడిని నేను. మళ్ళీ కొత్త రచనలు, కొత్తపత్రికలు, మళ్ళీ పోస్టాఫీసు ముందు పడిగాపులు – మామూలు కథే. ఓటమిని అంగీకరించని ప్రవృత్తి నాది. ఇప్పటికీ ఓటమి నన్ను రెచ్చగొడుతుంది. తిరగబడేటట్టు చేస్తుంది.

ఆ రోజుల్లో 'చిత్రగుప్త' అనే పత్రిక ఉండేది. దాంట్లో కారుడు కథలు అనే శీర్షిక ఉండేది. అక్కడికి క్రమంగా నాకు ప్రమోషన్ వచ్చింది. దరిమిలాను చిత్రగుప్తలో 'విభిన్న దృక్పథాల్లో వింత వ్యక్తులు' అనే సీరియల్ (5వారాలు పడింది). తర్వాతి విజయం – ఆంధ్రప్రభ వారపత్రికలో (నార్ల వారు సంపాదకులు – యిది చెప్పడానికి కారణం ముందు కథ) 'అనురాగాలూ – అంతఃకరణాలూ' అనే నాలుగువారాల సీరియల్, తరువాత 'ఇంద్రధనస్సు' అనే పెద్ద కథా పడ్డాయి.

అప్పటికి దేశికవితా మండలి ప్రచురణలు – శరత్ సాహిత్యమంతా ఔపోశన పట్టేశాను. హిందూ రీడింగ్ రూములో సూర్యనారాయణగారని లైబ్రేరియన్ ఉండేవారు. ఆయన తలుపులు తెరిచి కుర్చీలో కూర్చునేసరికి నేను సిద్ధంగా ఉండేవాడిని. మా నాన్నగారు రీడింగ్ రూం సభ్యులు. సూర్యనారాయణగారి మిత్రులు. కనక నేను ఆయనకి తెలుసు. ఆ లైబ్రరీలో కొవ్వలి, జంపన నవలలు, పాంచకడీదేవ్ అపరాధ పరిశోధక నవలలు (వాడే వీడు, నేనే, కాలూరాయి – ఇవి జ్ఞాపకం ఉన్నాయి) సూరంపూడి సీతారాం రెండు మహానగరాలు, కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో (డికెన్స్ అనువాదం) మార్క్ ట్వెయిన్ నవలలు – కాంచన ద్వీపం, హక బెరీ ఫిన్, మధిర సుబ్బన్న దీక్షితులు కాశీ మజిలీ కథలు – ఒకటేమిటి? చేతికందిన ప్రతీ పుస్తకం చదివేవాడిని. అది చల్లారని దావాగ్నిలాంటిది. వేసవి శెలవుల్లో మా చిన్నాయనగారింటికి శ్రీకాకుళం వెళ్ళేవాడిని. అక్కడా నాకు గ్రంథాలయమే గమ్యస్థానం. ఆ నలభై రోజులలో నా చదువు ఎంత ముమ్మరంగా సాగిందంటే – శెలవలు గడిచి, నేను పరీక్ష పాసయి, ఇంటర్మీడియెట్‌లో చేరేసరికి నాకు క్లాసులో దూరంగా ఉన్న బోర్డు మీది అక్షరాలు కనిపించలేదు. డాక్టర్ దగ్గరకి పరిగెత్తాను. నా పదిహేనో యేట మొదటిసారిగా హ్రస్వదృష్టికి కళ్ళజోడు అవసరమయింది. ఇప్పుడు నా కళ్ళజోడు వయస్సు 51 సంవత్సరాలు. అప్పట్లో నా కళ్ళజోడుకి మా అమ్మ బద్ధ వ్యతిరేకి. కారణం? కళ్ళజోడు పెట్టుకుంటే నేను వయస్సు మీద పడినవాడిలాగ కనిపిస్తానని. కళ్ళజోడు అనేది ఓ లోపాన్ని సరిదిద్దే సౌకర్యం అనీ, ఆ దశలో అది అవసరమని ఆమెని ఒప్పించలేకపోయాను. 'కళ్ళజోడు నారాయణ'గారి దుకాణానికి వెళ్ళి నన్ను కళ్ళజోడు తెచ్చుకోమన్నారు మా నాన్నగారు. చాలాకాలం పాటు నా కళ్ళజోడుకి ఏకైక శత్రువు మా అమ్మ. నా

పసితనాన్ని అది బలితీసుకున్నందుకు – కనీసం ఆమె దృష్టిలో.

ఈ రోజుల్లో చేతివాచీ, సెల్‌ఫోనూ, నల్లకళ్ళద్దాలూ లేని హైస్కూల్ కుర్రాడు కనిపించడు. ఆ రోజుల్లో మా నాన్నగారిని ఇవి (సెల్‌ఫోన్‌లు ఎలాగూ లేవు) కావాలని అడగాలని కూడా నాకు అనిపించలేదు. ఇంటర్మీడియెట్‌లో చేరాక మా నాన్నగారు ఓ రోజు పిలిచి 'మంగళగిరి సీతారామయ్యగారి దుకాణానికి వెళ్ళి ఓ వాచీ తెచ్చుకో' అన్నారు. వెళ్ళాను. మంగళగిరి సుదర్శనంగారు 'నివాడా' అనే వాచీని ఎంపిక చేశారు. 1954లో తేదీ ఉన్న వాచీ అది. చాలా ముందడుగు వేసిన వాచీ. మా నాన్నగారిచ్చిన బహుమతి నేనెన్నడూ మరిచిపోలేదు. ఆ తర్వాత మా ఇంట్లో అందరికీ మా తమ్ముళ్ళకీ, వాళ్ళ పిల్లలకీ, నా పిల్లలకీ పదోక్లాసు పాసయ్యాక వాచీ కొనివ్వడం ఆనవాయితీగా పెట్టుకున్నాను. ఇది మా నాన్నగారు నాకు చెప్పకుండానే అందిచ్చిన మరో సంప్రదాయం.

మరో చిన్న తమాషా – ఈ వాచీ గురించే. నేను ఆంధ్రప్రభలో పనిచేసే రోజుల్లో ఆంధ్రపత్రికకి ఓ కథ రాశాను. ఒక పత్రికలో పనిచేస్తూ మరో పత్రికకి రాయడం సంప్రదాయం కాదు కనక కలం పేరుతో రాశాను. ఏమిటా కలం పేరు? 'నివాద'. కథ పేరు 'నిదురపోయే సెలయేరు'. ఆ కథని ప్రచురణకి ఎంపిక చేసినట్టు ఉత్తరం రాస్తూ వారపత్రిక ఇన్‌ఛార్జి బుద్దవరపు చిన కామరాజుగారు 'నివాద' అంటే అర్థం ఏమిటి?' అని రాశారు.

'నాకూ తెలీదు. అది నా వాచీ పేరు ' అని రాశాను.

తర్వాత మేమిద్దరం ఆంధ్రప్రభలో కలిసిపనిచేశాం. కథ చదివి ప్రముఖ రచయిత, మిత్రుడు శ్రీపతి శ్రీకాకుళం నుంచి ఉత్తరం రాశాడు. 'కలం పేరుతో మీరు మీ సంతకాన్ని దాచలేరు. నిదురపోయే సెలయేరు రచయిత మీరేనని మీ శైలిని బట్టి పోల్చుకున్నాను' అని.

ఇక్కడ మరొక సరదా సంఘటన చెప్పాలి. రేనాడులో జూల్స్ వెర్న్ ప్రఖ్యాత నవల 'రౌండ్ ది వరల్డ్ ఇన్ ఎయిటీ డేస్'ని అనువదించాను. 'భూప్రదక్షిణం ' అన్న పేరుతో. కొన్ని వారాలయాక ఓ చిలిపి ఆలోచన వచ్చింది. సంపాదకునికి పెద్ద ఉత్తరం రాశాను. శరత్‌బాబు బాణీలో (అప్పటికి ఆయన రచనలు జుర్రుతున్నాను.)

"ఏదయినా అదెంత తక్కువయినా పారితోషికం ఇవ్వమ"ని.

ఇవ్వకపోతే? సీరియల్ నడుస్తోంది. మధ్యలో ఆగిపోతే గందరగోళం కదా? ఇది నా ఆలోచన. నిజానికి ఇది బ్లాక్ మెయిల్. కాని ముద్దుగా, హార్దికంగా రాశాను. పారితోషికం రాకపోతే రచన ఆపేస్తానని సూచించాను. పారితోషికం రాలేదు. రచన పంపడం ఆపేశాను. రేనాడులో ఇప్పుడేం జరుగుతుంది? ఆసక్తితో రేనాడు చూస్తున్నాను. నవల ఏ సగమో అయింది. నా రచన అయిపోయాక – ఒకే ఒక వాక్యం సంపాదకుడు చేర్చాడు. 'ఈ విధంగా ఫిలియాస్ ఫాగ్

(కథానాయకుడి పేరు) తన ఇంటికి చేరుకున్నాడు ' (అయిపోయింది) అని. నాకు మతిపోయింది. ఆ విధంగా నా మొదటి సంపాదనా ప్రయత్నానికి మొండిచెయ్యి ఎదురయింది.

అప్పటికి విశాఖపట్నంలో ఒకే మెయిన్ రోడ్ – రీడింగ్ రూం దగ్గర నిలబడితే పెద్ద మార్కెట్ దాకా రోడ్డు కనిపించేది. కురుపాం మార్కెట్ దగ్గర నిలిస్తే రీడింగ్ రూం కనిపించేది.

అప్పటికే ఓ కుర్ర రచయితకి చిన్న రెక్కలు వచ్చినట్టనిపించేది. వాటిని కొమ్ములుగా భావించే భ్రమలోకి మెల్లగా దూసుకు పోతున్నాను. ఓసారి చాగంటి సోమయాజులు గారితో రోడ్డుమీద అన్నాను 'రచనలు చేస్తున్నా మనల్ని ఎవరూ గుర్తించడం లేదండీ' అని.

ఆయన నోట్లో చుట్ట తీసి 'గుర్తించడానికి నువ్వేం రాశావని' అన్నారు ఖండితంగా. అంతే. అవాక్కయిపోయాను. ఆ తర్వాత అలాంటి మాట నా జీవితంలో ఎవరితోనూ అనలేదు. అనలేకపోయాను. ఎప్పుడనాలనిపించినా 'గుర్తించడానికి మనం ఏం చేశామని?' అన్న ప్రశ్న మనస్సులో నిలదీసేది. అది చాగంటి సోమయాజులుగారు నాకు ప్రారంభదశలోనే ఉపదేశించిన గీతా వాక్యం.

దాదాపు పది పన్నెండేళ్ళ తర్వాత – భిలాయ్ ఆంధ్రా అసోసియేషన్ నాకు సన్మానం చేసింది నాటక రచయితగా. చాగంటి సోమయాజులుగారు అధ్యక్షులు. సభలో ఈ మాట చెప్పి – అది నాకెప్పుడూ వార్నింగ్ సిగ్నల్‌గా ఉపకరించింది అన్నాను.

సోమయాజులుగారు 'అలా అన్నానా?' అని నవ్వుకున్నారు.

ఆ రోజుల్లో 'తెలుగు స్వతంత్ర' అని ఓ వారపత్రిక ఉండేది. దాని సంపాదకులు ఖాసా సుబ్బారావుగారయినా పత్రికని గోరా శాస్త్రిగారు చూసేవారు. అందులో ప్రముఖుల సూక్తులు సేకరించి 'ప్రేమ గురించి రెండు మాటలు' , 'డబ్బు గురించి రెండు మాటలు'లాంటివి పంపేవాడిని. అప్పటి నా కలం పేరు కోమలి. ఇలా సేకరించిన సూక్తులు క్రమంగా నా ఆలోచనలు నగిషీ పెట్టడం ప్రారంభించాయి. ప్రజామిత్ర అనే మరో పత్రిక బెంగుళూరునుంచి వచ్చేది.

భారతిలో రచన ప్రచురితం కావడం అంటే పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ తీసుకోవడంలాంటిదే అన్నాను. విశ్వనాథ సత్యనారాయణ (మధ్యాక్కరలు), బులుసు వెంకట రమణయ్య, మల్లంపల్లి సోమశేఖర శర్మ, డాక్టర్ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, నిడదవోలు వెంకటరావు, పిలకా గణపతి శాస్త్రి – వంటి సాహితీవేత్తల రచనలు ప్రచురితమయేవి.

భారతి పత్రిక తెలుగు వైభవాన్ని చాటే నిలువెత్తు పతాకం. అదొక గొప్ప శకం. ఇంకా శ్రీపాద సుబ్రహ్మణ్య

శాస్త్రిగారి 'ప్రబుద్ధాంధ్ర', పందిరి మల్లిఖార్జునరావుగారి 'కిన్నెర' 'సుభాషి ', 'వీణ', ముట్నూరి కృష్ణారావుగారి 'కృష్ణాపత్రిక', అయ్యంకి వెంకట రమణయ్యగారి 'ఆంధ్రభారతి', కౌతా శ్రీరామ శాస్త్రిగారి 'శారద', విశ్వనాథ సత్యనారాయణగారి 'వైజయంతి' వంటి పత్రికలు మళ్ళీ రాలేదు. అది తెలుగు జర్నలిజానికి స్వర్ణయుగం. న్యాపతి నారాయణమూర్తి, కుందూరి ఈశ్వరదత్తు, ఖాసా సుబ్బారావు, నార్లవెంకటేశ్వరరావు వంటి పాత్రికేయులు జర్నలిజానికి దేశీయ స్థాయిలో పెద్దపీట వేసిన మహనీయులు. పోతే, ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంధాలయంలో ఆనాటి లైబ్రేరియన్ అబ్బూరి రామకృష్ణారావుగారు పైన చెప్పిన సంచికలన్నింటిని చక్కగా బైండు చేయించి ఉంచారు. విద్యార్థి లోకానికి ఆయన యిచ్చిన గొప్ప వరం అది.

ఇలాంటి గ్రంథాలే ఆ రోజుల్లో ఓ లెక్కల విద్యార్థిని ఆ రంగంలోంచి బయటికి లాగి సాహితి ప్రపంచంవేపు గిరాటేశాయి. లైబ్రరీలో ఉన్న పుస్తకాల్ని తిరగేస్తూంటే గంటలు తెలియకుండానే దొర్లిపోయేవి. పరిశోధన చేసే విద్యార్థులతోపాటు దీటుగా నేనూ అక్కడే గడిపేవాడిని. ఆ దశ ఓ రచయిత  ఏర్పరుచుకున్న పునాది.

కందులవారి వీధిలో మా యింటి పక్కనే ఓ విశ్వబ్రాహ్మణుల కుటుంబం ఉండేది. ఆయన పేరు సున్నం వీర్రాజు కవి. పప్పుల వీధిలో ఉల్లాకు దుకాణం ఉండేది. నిండుగా, కుదిమట్టంగా, ప్రశాంతంగా, హాయిగా కనిపించే వారెప్పుడూ.

ఆయన వ్రాసిన పద్యకావ్యం "యక్షప్రవాసము" నాకిచ్చారు. ఒకరోజు తాను వ్రాసిన కొన్ని పద్యాలు, జంధ్యాల పాపయ్య శాస్త్రిగారి "పుష్పవిలాపం" పట్టుకు వచ్చారు. తన పద్యాలను మక్కికి మక్కీ జంధ్యాల వారు స్వీకరించారని ఆయన వాదం. అప్పటికి నేను చిన్నవాడిని. కవిత్వంలో ప్రవేశం తక్కువ. కాగా,ఆయన పద్యాలూ – పుష్పవిలాపంలాగానే ఉన్నాయి – చదవగా. మరి యిలాంటి 'భావన' మరెక్కడయినా ఉందేమో! లేదా ఇద్దరు రచయితలు 'ఒకే విధంగా' ఊహించడమూ అసాధ్యంకాదు. అంతకుమించి ఆ పద్యాలు నాకిప్పుడు గుర్తులేవు. అప్పటికే "పుష్పవిలాపం" ఘంటసాలగారి ధర్మమంటూ దేశమంతా మార్మోగిపోతోంది. అందుకని వీర్రాజు కవిగారు ఉలిక్కిపడ్డారేమో? నిజం అప్పటికీ యిప్పటికీ నాకు తెలియదు. కాని యిది నాకు బాగా గుర్తుండిపోయిన సందర్భం.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

Post your comments